సంక్షిప్త వార్తలు

యూత్ కాంగ్రెస్ క్రికెట్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న ఉసామొద్దీన్

చేగుంట(తూప్రాన్): యూత్ కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ అధ్యక్షుడు ఉసా మొద్దీన్ ఆధ్వర్యంలో సోమవారం వడియారం గ్రామంలో మండల స్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉసామొద్దీన్ మాట్లాడుతూ.. మండల స్థాయి క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు మూడు రోజుల పాటు ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు నవీన్, యూత్ కాంగ్రెస్ నాయకులు ప్రశాంత్, శ్రీకాంత్, మోహనా నాయక్, క్రీడాకారులు ఆర్కె గౌడ్, నవీన్, పాయి, మహేశ్ తదితరులు ఉన్నారు.

చెట్ల కొమ్మల తొలగింపు



జేసీబీతో చెట్ల కొమ్మలను తొలగిస్తున్న ఎస్ఐ పోచయ్య

రేగోడ్(మెదక్): రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రం రేగోడ్ నుంచి కొండాపూర్ వెళ్లే రోడ్డు మూలమలుపు వద్ద రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను ఎస్ఐ పోచయ్య సోమవారం తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు మూల మలుపుల వద్ద వాహనదారులకు ఎదురుగా వచ్చే వాహనం కనిపించక ప్రమాదాలు జరిగాయని చెప్పారు. ప్రమాదాల నివారణ కోసం కొమ్మలను తొలగించామని తెలిపారు. సంక్రాంతి సందర్భంగా కరి పండగ పేరుతో మద్యం సేవించి వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదానికి గురి కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

ముదిరాజ్‌లు ఐకమత్యంగా ఉండాలి



విద్యార్థిని సన్మానిస్తున్న సర్వేశ్వర శివాచార్య

పెద్దశంకరంపేట(మెదక్): ముదిరాజ్‌లు ఐకమత్యంగా ఉండి సమస్యల సాధనకు పోరాటం చేయాలని దుద్యాల ఆశ్రమ పీఠాధిపతి సర్వేశ్వర అంబిక శివాచార్య స్వామి అన్నారు. సోమవారం పేటలోని మానిక్‌ప్రభు దేవాలయంలో ముదిరాజ్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణతో కలిసి నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఇటీవల ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన నిహారికను వారు సన్మానించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మండలాధ్యక్షుడు పున్నయ్య, రవీందర్, సాయిలు, రమేశ్, రాములు, శంకరయ్య, అశోక్, బాగయ్య, మానిక్యం ఉన్నారు.

కార్మికులకు దుప్పట్లు అందజేత



దుప్పట్లు అందిస్తున్న ఎస్ఐ చైతన్య

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంట గ్రామ పంచాయతీ సఫాయి కార్మికులకు సోమవారం నాయకులు అయిత పరంజ్యోతి ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. సేవ కార్యక్రమాలను నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నవీన్, స్టాలిన్, శ్రీను, సత్తయ్య, మహేశ్, సాయిబాబా, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రమణాచార్యుల ఆరాధన ఉత్సవాలు



యజ్ఞం చేస్తున్న నిర్వాహకులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కంచన్‌పల్లిలో గ్రామ ఆధ్యాత్మిక గురువు రమణాచార్యుల 96వ ఆరాధన ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. కంచన్‌పల్లిలోని రమణాచార్యుల ఆశ్రమంలో తిమ్మాపూర్ గ్రామ అర్చకులు భగవాన్‌దాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి, యజ్ఞం చేసి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మాజీ సర్పంచ్‌లు, సత్యంగౌడ్, రజినిసుధాకర్, మోహన్‌దాస్, రాములు, ఆంజనేయులు గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని సంగాయిపేట గ్రామంలో ఇటీవల షార్ట్ సర్క్యూట్ కారణంగా నగరం నవాజ్ నివాసం ఉంటున్న ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. సోమవారం గ్రామానికి చేరుకొని బాధిత కుటుంబాన్ని బీజేపీ మండలాధ్యక్షుడు హరీశ్ పరామర్శించి తన వంతు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాధితులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ద్వారా ఇందిరమ్మ ఇల్లును మంజూరు చేయాలన్నారు. ఆయన వెంట సంగయ్యపేట బూత్ అధ్యక్షుడు ఆంజనేయులు, ఆ పార్టీ నాయకులు లింగం, గంగరాజు, సాయి, పూల్ సింగ్, రమేశ్, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

పగటిపూట వెలుగుతున్న లైట్లు



నర్సాపూర్: పట్టణంలో పలు వీధి స్తంభాలకు లైట్లు రాత్రింబవళ్లు వెలుగుతున్నాయి. వీధి దీపాలు ఉదయం కాగానే ఆఫ్ చేయకపోవడంతో అవి రాత్రింబవళ్లు వెలుగుతున్నాయని ప్రజలు విమర్శిస్తున్నారు. పట్టణంలోని పలు వీధి దీపాలకు ఆటోమెటిక్ సిస్టం అమర్చినా.. వాటిని పర్యవేక్షించకపోవడంతో పలు చోట్ల పగటి పూట సైతం లైట్లు వెలుగుతున్నాయని తెలిసింది. ఇదిలా ఉండగా మెయిన్‌రోడ్డుపై పలు వీధి దీపాలు వెలగడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. పగటి పూట వెలుగుతున్న వాటిని సరి చేసి కాలిపోయిన లైట్ల స్థానంలో కొత్త వాటిని బిగించి వెలిగేలా చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

కుట్టుమిషన్ పంపిణీ

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని ఖాజాపూర్ తండాకు చెందిన నిరుపేద యువతి మౌనికకు సీటీబీహెచ్ ఫౌండేషన్ సహకారంతో సాసీక్ష ఫౌండేషన్ చైర్మన్ శివ కుట్టుమిషన్‌ను అందించారు. కుట్టుమిషన్ అందించేందుకు సహకరించిన వైష్ణవి, భార్గవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మోతిలాల్, లక్ష్మి, రాంచరణ స్వర్ణ పాల్గొన్నారు.

వైభవంగా గోదా కల్యాణం

ఆలయాల్లో భక్తుల సందడి



ఇబ్రహీంపూర్‌లో జరిగిన గోదాదేవి రంగనాథుల కల్యాణంలో పాల్గొన్న భక్తులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని పలు ఆలయాల్లో గోదాదేవి కల్యాణం సోమవారం నిర్వహించారు. చేగుంట వేంకటేశ్వర ఆలయంలో వాసుదేవచారి, ఇబ్రహీంపూర్ వేంకటేశ్వర ఆలయంలో ధర్మకర్త కిషన్‌రావు ఆధ్వర్యంలో గోదా రంగనాథస్వామి కల్యాణ మహోత్సవాలను చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేశ్, భిక్షపతి, పెంటయ్య, రాము, రాజేశ్, మల్లేశ్‌తో పాటు భక్తులు పాల్గొన్నారు.

వెల్మకన్నలో..

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలోని శ్రీరాయగిరి వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం గోదాదేవి రంగనాయకస్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు మంగళగిరి రాము, తులసి శ్రీనివాస్, సాయిప్రసాద్ ఆధ్వర్యంలో ఆలయంలోని కల్యాణ మండపంలో దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలను భక్తిశ్రద్ధలతో ఆటపాట, భజనలతో ఊరేగించి, ఎదుర్కోలు నిర్వహించారు. అనంతరం కల్యాణ మహోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజేందర్, మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు నవీన్‌గుప్తా, ఆలయ భజన మండల సభ్యులు శ్రీశైలం, విఠల్, వెంకటయ్య, రమణ, దిలీప్, నాగభూషణం, శ్రీధర్, అశోక్, రాకేష్, రమేశ్, భూమయ్య, గ్రామస్తులు భక్తులు పాల్గొన్నారు.



కౌడిపల్లి(నర్సాపూర్): వెల్మకన్నలో గోదా రంగనాయకస్వామి కల్యాణం

అధికారుల నిర్లక్ష్యంతో రుణమాఫీ కాలేదు

రైతు ఆవేదన



రైతు శేఖర్‌రెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): సహకార సంఘం అధికారుల నిర్లక్ష్యంతో తనకు రుణమాఫీ జరగడం లేదని మండలంలోని కుమ్మరిపల్లి గ్రామానికి చెందిన రైతు కొంసాని శేఖర్‌రెడ్డి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మడూర్ సహకార సంఘంలో తాను రుణం పొందగా, తన పేరున రెండు ఖాతాలు చూపెట్టడంతో పాటు తాను తీసుకున్న రుణం ఒక లక్షలోపు ఉండగా రూ.3 లక్షలు చూపెట్టింది. దీంతో తనకు రుణమాఫీ జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు తెలియకుండా తన పేరున మరో ఖాతాను తెరిచి రుణం తీసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఉన్నతాధికారులు విచారించి తనకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయంపై మడూర్ సహకార సంఘం చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సీఈఓ కృష్ణ మాట్లాడుతూ.. సహకార సంఘం డేటా ఎంట్రీ ఆపరేట్ చేసిన తప్పుతో శేఖర్‌రెడ్డి పేరున రెండు ఖాతాలు చూపెట్టడం జరిగిందన్నారు. గ్రామంలో కొంసాని శేఖర్ రెడ్డి అనే వ్యక్తులు ముగ్గురు ఉండడంతో మిస్‌మ్యాచింగ్ జరిగిందన్నారు. ఈ విషయంపై సవరణ చేసి రుణమాఫీ కోసం ఉన్నత అధికారులకు పంపినట్లు తెలిపారు. ఇందులో ఎలాంటి అవకతవకలు జరగలేదన్నారు.

ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ



ఎమ్మార్పీఎస్ మండల నూతన కమిటీ సభ్యులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని సోమవారం నియమించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెట్లపల్లి యాదగిరి ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నుకున్నారు. శివ్వంపేట మండలాధ్యక్షుడిగా పెద్దకొల్ల లింగవ, ఉపాధ్యాక్షులుగా కాలకంటి వెంకటేష్, రేవంత్‌కుమార్, రాములు, ధన్‌రాజ్, అధికార ప్రతినిధిగా నర్సింలు, కార్యవర్గ సభ్యులుగా పోచయ్య, మల్లేశ్, రాజు, నాగరాజు, నర్సింలు, పెద్దకొల్ల నర్సింలు, గౌరవాధ్యక్షులు భిక్షపతి, ప్రభుదాస్, సలహాదారులుగా పోచయ్య, కుంట రాజు ఏకగ్రీవంగా నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు భిక్షపతి, పోచయ్య శంకర్, ఎల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు సంతోషంగా ఉండాలి

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి



నర్సాపూర్: సంక్రాంతి పండుగ ప్రజల జీవితాల్లో సుఖ సంతోషాలు నింపాలని ఎమ్మెల్యే సునీతా రెడ్డి ఆకాంక్షించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రజలందరికి సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రైతులు సుభిక్షంగా ఉండాలని, మన ప్రాంతం సస్యశ్యామలం కావాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నానని చెప్పారు.

జిల్లా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి



మెదక్ మున్సిపాలిటీ: మెదక్ జిల్లా ప్రజలకు, బీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి మకర సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ప్రజల జీవితాల్లో సంక్రాంతి సుఖ సంతోషాలు నింపాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ సంక్రాంతి పండగను ఆనందంగా జరుపుకోవాలని, గాలిపటాలు ఎగురవేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. రాబోయే రోజుల్లో మరింత ఉత్సాహంతో భగవంతుడి అనుగ్రహంతో అభివృద్ధిలో పయనించాలన్నారు.

కొనసాగుతున్న పోటీలు



పోటీలో పాల్గొన్న క్రీడాకారులు

రామాయంపేట(మెదక్): మండలంలోని అక్కన్నపేట గ్రామంలో అక్కన్నపేట ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) క్రికెట్ టోర్నీ కొనసాగుతోంది. ఈ టోర్నీలో మొత్తం నాలుగు జట్లు పాల్గొనగా, కేపీఎస్ టీం, ఎస్‌సీపీ టీంలు ఫైనల్‌కు చేరుకున్నాయి. మంగళవారం ఫైనల్ పోటీలు జరుగనున్నట్లు క్రీడాకారులు తెలిపారు.

చెక్కు అందజేత

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని కే. వెంకటాపూర్ గ్రామానికి చెందిన రాజు లలితకు సోమవారం రూ. 54 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు దయాకర్, మాజీ ఎంపీటీసీ భాగ్యలక్ష్మి, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు దుబ్బరాజు, మహిపాల్, మల్లేశం, సుధాకర్, ఇంద్రసేన, బాలయ్య, ఎల్లం, గోపరి పెంటయ్య పాల్గొన్నారు.

కంకరతో వాహనదారుల ఇబ్బందులు



మూల మలుపు వద్ద పడిన కంకర

నర్సాపూర్: బీటీ రోడ్డుపై కంకర పడడంతో వాహనదారులు చాలా ఇబ్బందులు పడ్డారు. కంకరను ట్రాక్టర్‌లో తరలిస్తుండగా నర్సాపూర్ పట్టణ పరిధిలోని జాతీయ రహదారితో పాటు పట్టణంలోని మహాత్మాగాంధీ రోడ్డుపై అక్కడక్కడ పరిచినట్లుగా కంకర పడింది. దీంతో వాహనదారులు తమ వాహనాలు నడిపేందుకు ఇబ్బందులు పడ్డారు. కంకర, ఇసుక తరలించే వాహనదారులు జాగ్రత్తలు తీసుకునేలా ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మాజీ ఎంపీకి ఘన నివాళి



జగన్నాథం చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

చేగుంట(తూప్రాన్): ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మాజీ ఎంపీ మంద జగన్నాథం చిత్రపటానికి చేగుంట గాంధీ చౌరస్తా వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు రామస్వామి మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ ఉద్యమానికి మద్దతు తెలిపిన ఆయన మృతి తీరని లోటుగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాములు, సాయిబాబా, నరేష్, అఖిల్, స్వామి తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

◆ ఆధ్యాత్మికత అవసరం



నర్సాపూర్ రూరల్: ప్రస్తుత కాలంలో ప్రతీ ఒక్కరికి ఆధ్యాత్మికత చింతన అవసరమని మాధవానంద సరస్వతి అన్నారు. మండలంలోని గొల్లపల్లిలో కొన్న సాగుతున్న భ్రమరాంబికా మల్లికార్జున స్వామి ఉత్సవాల సందర్భంగా సోమవారం ఆలయాన్ని సందర్శించి, ప్రసంగించారు. అనంతరం ఉత్సవాల మూడో రోజు సందర్భంగా స్వామివార్లకు ప్రత్యేక పూజలతో పాటు రుద్రయాగం, సామూహిక సత్యనారాయణ వ్రతాలు, అన్నదానం, సాయంత్రం బండ్లు, బోనాల ఊరేగింపు, పోతరాజుల విన్యాసాలు, ఒగ్గు కళాకారుల ప్రదర్శన, కోలాటం ఆయా సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

◆ అక్రమ కలప తరలిస్తున్న ట్రాక్టర్లకు జరిమానా

రామాయంపేట(మెదక్): కలపను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లకు జరిమానా విధించినట్లు అటవీశాఖ రేంజ్ అధికారి విద్యాసాగర్ తెలిపారు. ఆదివారం రాత్రి రెండు ట్రాక్టర్లలో అక్రమంగా కలపను తరలిస్తున్నట్లు తమ దృష్టికి రాగా, వాటిని పట్టుకొని జరిమానా విధించామన్నారు. యూకలిప్టస్ కలప రవాణాకు సైతం ముందస్తు సంబంధిత రైతుల అంగీకార పత్రం వాహనం వెంట ఉండాలని ఆయన సూచించారు. అక్రమ కలప రవాణాను అనుమతించమన్నారు.

◆ చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు

పెద్దశంకరంపేట(మెదక్): నిషేధిత చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ శంకర్ అన్నారు. సోమవారం పెద్దశంకరంపేటలోని మంజా విక్రయ దుకాణాల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా చైనా మాంజా విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రజలు పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని, శాంతి భద్రతలకు సహకరించాలని కోరారు.

ఉత్సవాలకు రామలింగేశ్వరాలయం ముస్తాబు

- మూడు రోజులపాటు ప్రత్యేక పూజలు
- భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు



ముస్తాబైన రామలింగేశ్వరాలయం

తూప్రాన్: మెదక్ జిల్లా తూప్రాన్ మండలం ఇస్లాంపూర్ గ్రామ శివారులోని రామలింగేశ్వరాలయం విశిష్టమైంది. ఈ ఆలయంలో ఏటా మకర సంక్రాంతి సందర్భంగా మూడు రోజులపాటు ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలకు ఇతర జిల్లాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో వస్తుంటారు.

తూప్రాన్ మండలం ఇస్లాంపూర్ గ్రామ శివారులో శతాబ్దాల క్రితం భూమి నుంచి 300 అడుగుల ఎత్తులో రామలింగేశ్వరాలయాన్ని నిర్మించారు. మండలం పాటు దీక్షల అనంతరం ఈ ఆలయంలో రాత్రి నిద్రించిన వారికి మునులు భజనలు, సంకీర్తనలు చేసినట్లు వినిపిస్తాయని పెద్దలు చెబుతారు. ప్రతీ సంవత్సరం ఈ ఆలయంలో ప్రతేక పూజలు నిర్వహిస్తారు.

15 నుంచి ప్రత్యేక పూజలు

మంగళవారం గణపతి పూజ, పున్యాహవచనం, అఖండ దీపారాధన, రుద్రాభిషేకం, బండ్లు, బోనాలు, బుధవారం స్వామివారికి రుద్రాభిషేకం, దేవతామూర్తులకు అభిషేకం, గోపాల కాల్వలు, ఊరేగింపు, గురువారం రుద్రగణపతి, నవగ్రహ హోమం, రథోత్సవం కార్యక్రమాలు ఉంటాయని అర్చకుడు ఆత్రేయశర్మ, గ్రామస్తులు తెలిపారు. మూడు రోజుల ముందు నుంచే చిరు వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేసుకోవడంలో నిమగ్నమయ్యారు.

బగలాముఖీ ఆలయంలో పౌర్ణమి పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

బ్రాహ్మణ నివాస భవనానికి రూ.4 లక్షల విరాళం

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో కొలువైన బగలాముఖీ శక్తిపీఠంలో పౌర్ణమి సందర్భంగా సోమవారం విశేష పూజలు చేశారు. వేద పండితుడు, బగలాముఖీ ఉపసాకుడు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి హరిద్వార్చన, విశేష పూజలు, హోమం నిర్వహించారు. దీంతో పాటు అమ్మవారి పంచలోహ విగ్రహానికి పంచామృత అభిషేకం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ నిర్వాహకులు, హైకోర్టు న్యాయవాది శివకుమార్‌గౌడ్ అన్నదానం ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మహేశ్ గుప్తా, నిర్వాహకులు సూర్యకుమార్‌గౌడ్, శ్రీనివాస్ రావు, సత్యనారాయణగౌడ్, పోచగౌడ్, కొండల్, నాగరాజు, వెంకటేశ్, అర్చకులు కమలేష్, తదితరులు ఉన్నారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన వినయ్ కుమార్‌చంద్ ఉద్యోగరీత్యా ఆస్ట్రేలియాలో ఉంటున్నాడు. ఆదివారం బగలాముఖీ అమ్మవారిని కుటుంబ సమేతంగా దర్శించుకొని ఆలయ ప్రాంగణంలో బ్రాహ్మణ నివాస భవన నిర్మాణానికి రూ. 4 లక్షల రూపాయల నగదు విరాళం వేద పండితుడు వెంకటేశ్వరశర్మ అందజేశాడు.

పండుగపూట ‘కన్నీటి’ కష్టాలు



పాత పోస్ట్ ఆఫీస్ వద్ద పాడైపోయిన బోరు

పాపన్నపేట(మెదక్): సంబరాల సంక్రాంతి పాపన్నపేట వాసులకు ‘కన్నీటి’ కష్టాలను మిగిల్చింది. పంచాయతీలో నిధుల కొరతతో అధికారులు రిపేర్లు చేయించలేక పోతున్నారు. గ్రామంలో సింగిల్ ఫేజ్ మోటార్లు కాలిపోయి నెలలు కావస్తున్నా, రిపేరుకు నోచుకోవడం లేదు. దీంతో గ్రామస్తులు గృహ అవసరాలకు, దుస్తులు పిండుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. పండగ పూట మిషన్ భగీరథ నీళ్లు కూడా తక్కువగా రావడంతో ,గ్రామస్తుల అవస్థలు రెట్టింపు అయ్యాయి. గ్రామంలోని పాత పోస్ట్ ఆఫీస్ వద్ద, శ్రీరాం వాళ్ల ఇంటి ఎదుట బోరు మోటార్లు కాలిపోయి నాలుగు నెలలు అవుతుందని వారు వాపోయారు. వీరభద్ర కిరాణం షాపు ఎదుట ఉన్న బోరులో నీటి మట్టం తగ్గిపోవడంతో అక్కడ కూడా సరిపోను నీరు రావడం లేదు. గ్రామంలో చేద బావులు కనుమరుగు అవడంతో, బోరు బావుల మీదే ఆధార పడుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి నయీం మాట్లాడుతూ.. నిధుల కొరతతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, త్వరలో రిపేరు చేయిస్తామన్నారు.

ఆదరణ ఏదీ ?

- ప్రభుత్వం ఆదుకోవాలని గంగిరెద్దులవారి వినతి




గంగిరెద్దులవారు ఎద్దుతో చేస్తున్న విన్యాసాలు



ఎద్దును తనపై నిలబెట్టుకుంటున్న వ్యక్తి

చిలప్‌చెడ్(నర్సాపూర్): సంక్రాంతి పండుగ వచ్చిందంటే చాలు గ్రామాల్లో ఇంటి ముందుకు బసవన్నతో విన్యాసాలు చేయించేవారు. ప్రస్తుతం గంగిరెద్దులవారికి ఆదరణ కరువై, బసవన్న విన్యాసాలు కనుమరుగై పోతున్నాయి. పశువులతో గ్రామాలు, పట్నాల చుట్టూ తిరుగుతూ, వాటిని ఆడిస్తూ జీవించేవారు. ఎక్కడికైన వలస వెళితే ఆ గ్రామ శివారులో గుడారులు వేసుకొని అక్కడే పనులు చేసుకునేవారు. మండలంలోని సోమక్కపేట గ్రామ పంచాయితీ పరిధిలో ఉంది గంగిరెద్దుల గూడెం. సుమారు 60 ఏళ్ల క్రితం ఈ ప్రాంతానికి వచ్చిన నలుగురు గంగిరెద్దుల వ్యక్తులు వచ్చి స్థిరపడ్డారు. క్రమక్రమంగా ఇదే ప్రాంతంలో గంగిరెద్దుల వారి జనాభా పెరిగింది. దాంతో వారు ఇక్కడే శాశ్వతంగా స్థిరపడ్డారు. వారి జీవన విధాన పద్ధతితో ఈ ప్రాంతం గంగిరెద్దుల గూడెంగా మారిపోయింది. ప్రస్తుతం గంగిరెద్దుల గూడెంలో 70 కుటుంబాలకు పైగా నివసిస్తున్నాయి. ప్రధానంగా గంగిరెద్దుల వారి కుల వత్తి ఎద్దులను ఆడించడం, వాటితో విన్యాసాలు చేయడం, వాటిని వలసలు తీసుకెళ్లి అక్కడి గ్రామాల్లో ఆడించడం. సంక్రాతి సీజన్ వచ్చిందంటే గంగిరెద్దులగూడెంలో ఉన్న యువకులు పెద్దలందరూ తమ పశువులతో పట్నం వెళ్లి ఒక్కొక్కరు ఓ కాలనీలో ఎద్దులు ఆడించుకుంటూ పొట్టపోసుకుంటుంటారు. మరికొందరు గ్రామాల్లో ఎద్దులను ఆడిస్తూ ఉంటారు. ప్రస్తుతం వారికి ఎలాంటి ఆదరణ లేదు. పరిస్థితి ఇదే విధంగా కొనసాగితే గంగిరెద్దుల విన్యాసాలు అంతరించి పోయే అవకాశం ఉంది.

ప్రభుత్వం ఆదుకోవాలి



60 ఏళ్లుగా గంగిరెద్దుల గూడెంలో నివసిస్తున్నాం. తమ గూడెం ఇప్పుప్పుడే అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. కేవలం కుల వృత్తి పైనే ఆధారపడే తమకు ప్రభుత్వం మూడెకరాల భూమి ఇవ్వాలి. అదే విధంగా తమ కులవృత్తిని అగౌరవపరిచేలా చూడకూడదన్నారు. ప్రభుత్వం మాకు ఆర్థికాభివృద్ధికి సహకరించాలి.

–అంబయ్య, గంగిరెద్దులగూడెం

కుల వృత్తితోనే మా జీవనం



కుల వృత్తి చేస్తేనే తమ కడుపునిండుతుంది. సంక్రాతి పండుగ సమయంలో గూడెంలోరి మగ వాళ్లు అందరూ కలసి పట్నానికి వెళ్లి అక్కడ తమ కుల వృత్తిని ప్రదర్శిస్తూ నాలుగు రాళ్లు వెనకేసుకునే వాళ్లం. ప్రస్తుతం బసవన్న విన్యాసాలకు విలువ ఇవ్వకుండా, మమ్మల్ని భిక్షగాళ్లలా చూడడం బాధగా ఉంది.

– ఎల్లయ్య, గంగిరెద్దులగూడెం

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. లక్ష్మణ్
9502735264